

సాక్షి
పల్నాడు
శనివారం । 14 । అక్టోబర్ । 2023



సాగునీటి సమాచారం

తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల): కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద శుక్రవారం 2953 క్యూసెక్కులు విడుదల చేశారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం శుక్రవారం 527.00 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 5,598, ఎడమకాలువకు 6,022 క్యూసెక్కులు విడుదలవుతోంది.



దేవస్థానంలో ఏర్పాట్లు పరిశీలన

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): దసరా ఉత్సవాల్లో భక్తులకు అమ్మవారి పరిపూర్ణ దర్శనం కలిగేలా ఏర్పాట్లు చేస్తున్నట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ తెలిపారు.

న్యూస్‌రీల్

అమ్మవారి హుండీ ఆదాయం రూ.7.46లక్షలు

దుర్గి: అడిగొప్పలలోని నిదానంపాటి శ్రీలక్ష్మీ అమ్మవారి హుండీ కానుకలు లెక్కించగా రూ.7,46,979 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి గిరిరాజు నరసింహబాబు తెలిపారు. శుక్రవారం అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సైదమ్మబాయి ఆధ్వర్యంలో 29 రోజులపాటు భక్తులు అమ్మవారికి సమర్పించిన హుండీ లెక్కింపు చేపట్టారు. కానుకల రూపంలో వచ్చిన ఆదాయాన్ని బ్యాంకు అధికారులకు అందజేసి సంబంధిత రసీదును తీసుకున్నట్లు అధికారులకు వివరించారు. కార్యక్రమంలో పేటసన్నిగండ్ల గ్రూప్ టెంపుల్స్ కార్యనిర్వహణాధికారి సైదమ్మబాయి, కరాలపాటి సుబ్బారావు, పాండురంగారావు, కలవల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల సేవలు భేష్



మేదరమెట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో సచివాలయాల ద్వారా అందిస్తున్న సేవలు భేషుగ్గా ఉన్నాయని కేరళ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ లోకల్ అడ్మినిస్ట్రేషన్ పరిశీలకురాలు శిరీష అన్నారు. కొరిశపాడు మండలంలోని మేదరమెట్ల గ్రామ పంచాయతీ పరిధిలోగల సచివాలయాన్ని ఆమె శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సచివాలయ ఉద్యోగులతో ఆమె మాట్లాడారు. పంచాయతీలో ఉన్న మౌలిక సదుపాయాల గురించి, ఆర్థిక సమీకరణల గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. తడి,పొడి చెత్త నుంచి సంపదను తయారు చేస్తున్న కేంద్రాన్ని కూడా పరిశీలించారు. ఆమె వెంట సర్పంచ్ బొనిగల ఎలీశమ్మ, డీపీఓ ఆఫీస్ సూపరింటెండెంట్ బి.సుబ్బారావు, ఎంపీడీఓ సురేష్‌బాబు, ఈఓపీఆర్‌డీ ఓబులేసు, ఈఓ శ్రీనివాసరావు, స్థానిక రైతులు, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

దసరా సెలవుల్లో తరగతులు నిర్వహిస్తే కఠిన చర్యలు

డీఈఓ పి.శైలజ

గుంటూరు ఎడ్యుకేషన్: దసరా పండుగను పురస్కరించుకుని ప్రభుత్వం ప్రకటించిన సెలవుల్లో విద్యార్థులకు ఎటువంటి తరగతులు నిర్వహించరాదని డీఈఓ పి.శైలజ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలలకు శనివారం నుంచి ఈనెల 24వ తేదీ వరకు సెలవులుగా పరిగణించాలని, క్రిస్టియన్ మైనార్టీ పాఠశాలలకు ఈనెల 21 నుంచి 24 వరకు దసరా సెలవులు ప్రకటించినట్లు పేర్కొన్నారు. సెలవు రోజుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ తరగతులు నిర్వహించరాదని, ప్రభుత్వ ఉత్తర్వులకు విరుద్ధంగా తరగతులు నిర్వహించే యాజమాన్యాలపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని ఉప విద్యాశాఖాధికారులు, మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని పాఠశాలల్లో తరగతులు నిర్వహించకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు.

యార్డులో 23,379 బస్తాల మిర్చి విక్రయం



కొరిటిపాడు(గుంటూరు): గుంటూరు మార్కెట్ యార్డుకు శుక్రవారం 21,315 మిర్చి బస్తాలు రాగా, గత నిల్వలతో కలిపి ఈ–నామ్ విధానం ద్వారా 23,379 బస్తాలు అమ్మకాలు జరిగాయి. నాన్ ఏసీ కామన్ రకం 334, నంబర్–5, 273, 341, 4884, సూపర్–10 రకాల మిర్చి సగటు ధర రూ.10,000 నుంచి రూ.23,000 వరకు పలికింది. నాన్ ఏసీ ప్రత్యేక రకం తేజ, బాడిగ, దేవనూరు డీలక్స్ రకాల మిర్చి సగటు ధర రూ.9,500 నుంచి 25,000 వరకు లభించింది. ఏసీ కామన్ రకం క్వింటాలుకు రూ.15,000 నుంచి రూ.21,000 వరకు పలికింది. ఏసీ ప్రత్యేక రకాల మిర్చికి రూ.10,500 నుంచి 24,000 వరకు లభించింది. తాలు రకం మిర్చికి రూ.6,200 నుంచి రూ.14,500 వరకు ధర పలికింది. అమ్మకాలు ముగిసే సమయానికి యార్డులో ఇంకా 7,216 బస్తాల మిర్చి నిల్వ ఉన్నట్లు యార్డు ఉన్నత శ్రేణి కార్యదర్శి ఐ.వెంకటేశ్వరరెడ్డి తెలిపారు.

సమృద్ధిగా కొనసాగు

రబీ పంటకు పుష్కలంగా ఎరువులు

- 2023–24 రబీకి ఎరువుల ప్రణాళిక ఖరారు చేసిన వ్యవసాయ శాఖ
- 2,52,500 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం
- ఇప్పటికే జిల్లాలో అందుబాటులో 62,302 మెట్రిక్ టన్నులు
- పల్నాడులోని 421 ఆర్బీకేల ద్వారా రైతులకు అందుబాటులో ఉండనున్న వైనం
- ముందస్తు రబీకి ఎరువుల కొరత లేకుండా ఏర్పాట్లు చేశామంటున్న అధికారులు



ఆర్‌బీకేలలోకి ఎరువులను చేరవేస్తున్న దృశ్యం (ఫైల్)

సాక్షి, నరసరావుపేట: ఎరువుల కోసం రైతులు పాట్లు పడకుండా వ్యవసాయం చేస్తున్న ఊరిలోనే అవసరమైనన్ని అందుబాటులో ఉంచేలా పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారులు ముందస్తు ప్రణాళికలు సిద్ధం చేశారు. రబీ, ముందస్తు రబీ పంటల కోసం వైఎస్సార్ రైతు భరోసా కేంద్రాలలో కావాల్సిన అన్నిరకాల ఎరువుల నిల్వలు ఉంచేలా చర్యలు తీసుకుంటున్నారు. ఈ మేరకు 2023–24 రబీ పంటకు ఎరువుల ప్రణాళిక సిద్ధం చేసి అన్నదాతలకు ఎరువుల కొరత అన్న మాట లేకుండా నాణ్యమైన సరకును అందుబాటులో ఉంచనున్నారు. పల్నాడు జిల్లాలో వ్యవసాయ పంటలు అన్నీ కలిపి సుమారు 68 వేల హెక్టార్లలో సాగవుతాయని అధికారులు అంచనా వేశారు.

2.24 లక్షల మెట్రిక్ టన్నులు అవసరం...

2023–24 ఏడాదిలో రబీ పంటసాగు నిమిత్తం అన్ని రకాల ఎరువులు కలుపుకొని 2,24,393 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం కానుంది. ఇందులో ప్రస్తుతం జిల్లాలో 62,302 మెట్రిక్ టన్నుల ఎరువులు ఇప్పటికే అందుబాటులో ఉన్నాయి. వీటిలో అత్యధికంగా యూరియా 17 వేలు, కాంప్లెక్స్ 32 వేలు, డీఏపీ 9 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. జిల్లాలో యూరియా డిమాండ్ ఉన్న నేపథ్యంలో రైతులకు అవసరమైన మేరకు అందుబాటులో ఉంచేలా వ్యవసాయశాఖ కృషి చేస్తోంది. త్వరలో మరో 11 వేల మెట్రిక్ టన్నులు జిల్లాకు రానుంది.

జిల్లాలో రబీకి అవసరమైన ఎరువుల ప్రణాళిక

రకం	పరిమాణం (ఎంటీలలో)
యూరియా	70,223
డీఏపీ	19,596
కాంప్లెక్స్	1,24,675
ఎంఓపీ	7,795
ఎస్ఎస్‌పీ	2,104
మొత్తం	2,24,393



ఎరువుల వివరాలను రైతులకు కియోస్కో మిషన్ ద్వారా వివరిస్తున్న ఆర్‌బీకే సిబ్బంది (ఫైల్)

ఆర్‌బీకేలలో పుష్కలంగా లభ్యత...

ఆర్‌బీకేలలోనే ఎరువుల విక్రయాలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా జిల్లాలోని 421 ఆర్‌బీకేలలో 2023–24 ఏడాదిలో 75,200 మెట్రిక్ టన్నుల ఎరువులు విక్రయించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. జిల్లాకు వచ్చిన ఎరువుల కోటాలో మార్క్‌ఫెడ్‌కు కేటాయించి అనంతరం రైతు భరోసా కేంద్రాల ద్వారా నిర్ణీత ధరలకే విక్రయించనున్నారు. ప్రస్తుతం ఆర్‌బీకేలలో 6,054 మెట్రిక్ టన్నుల ఎరువుల నిల్వలు ఉన్నాయి. ఇందులో యూరియా 2,750 మెట్రిక్ టన్నులు, డీఏపీ 2,269 మెట్రిక్ టన్నులు ఉన్నాయి.

జిల్లాలో ఎరువుల కొరత లేదు...



2023–24 రబీకి మండల, డివిజన్ల వారీగా ఏ రకం ఎరువులు ఎన్ని మెట్రిక్ టన్నులు అవసరమన్న సమాచారం సేకరించాం. 2,24,393 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కానుందని అంచనా వేశాం. జిల్లాలో యూరియా కొరత లేదు, అది తప్పుడు ప్రచారం మాత్రమే. ఇప్పటికే 17 వేల మెట్రిక్ టన్నులకు పైగా ఉండగా, త్వరలో మరో 11 వేల మెట్రిక్ టన్నులు రానుంది. ఆర్‌బీకేలలో రైతులకు అవసరమైన నిల్వలు ఉన్నాయి. ప్రైవేట్ దుకాణాల్లో అధిక ధరలు, నకిలీ ఎరువుల విక్రయాలను అరికడతాం.

– ఐ.మురళీ, పల్నాడు జిల్లా వ్యవసాయశాఖ అధికారి

'బంగారు తల్లి' బాధ్యత ఉపాధ్యాయులదే

- జిల్లా కలెక్టర్ శివశంకర్ ఆదేశం
- ఏఎన్ఎంలతో చేయించడంపై ఆగ్రహం
- ఉపాధ్యాయులే నమోదు చేయాలి



బంగారు తల్లి పథకంపై విద్యార్థినులతో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ శివశంకర్

నరసరావుపేట రూరల్: బంగారు తల్లి పథకంలో విద్యార్థినుల వివరాల నమోదు బాధ్యత ఉపాధ్యాయులదేనని జిల్లా కలెక్టర్ శివశంకర్ లోతేటి పేర్కొన్నారు. మండలంలోని లింగంగుంట్ల శంకరభారతీపురం జెడ్పీ హైస్కూల్‌లో బంగారు తల్లి పథకాన్ని శుక్రవారం పరిశీలించారు. విద్యాశాఖ ద్వారా వివరాలు నమోదు చేయాల్సి ఉండగా ఏఎన్ఎంలు ద్వారా నమోదు చేయడంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థినులకు అందజేసిన కార్డుల్లో నమోదు చేసిన వివరాలు కూడా సరిగా లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థినుల వద్ద కార్డులను పరిశీలించి రక్తంలో హిమోగ్లోబిన్ శాతం నమోదు చేయకపోవడంపై డీఈఓ శామ్యూల్, ఎంఈఓ ప్రభాకర్, ప్రధానోపాధ్యాయురాలు పార్వతిలను ప్రశ్నించారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా బంగారు తల్లి పథకాన్ని ప్రభుత్వం ప్రారంభించిందని తెలిపారు. విద్యార్థినుల్లో ఉన్న రక్తహీనతను గుర్తించి తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. పోషకాహార విలువల ఉన్న ఆహారాన్ని తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ రమణానాయక్, వైద్య, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

రక్తశాతం పెంపుపై చైతన్యపరచాలి

నరసరావుపేట: జిల్లావ్యాప్తంగా చిన్నపిల్లల దగ్గర నుంచి యువతవరకు హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు వారితో పాటు తల్లిదండ్రులను చైతన్య పర్చాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం గ్రామోదయం, నగరోదయం పథకంలో భాగంగా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలు నుంచి జాయింట్ కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాదుతో కలిసి జిల్లాలోని వివిధ శాఖల అధికారులతో బంగారుతల్లి, మధ్యాహ్నం భోజన పథకాలపై సమీక్ష చేశారు. పదేళ్ల నుంచి 19 ఏళ్ల బాలికలు, యువత వరకు ఎనీమియా బారి నుంచి రక్షణ పొందేందుకు వారిలో ఉన్న రక్తహీనత శాతాన్ని తగ్గించటమే బంగారు తల్లి కార్యక్రమం అన్నారు. వారిలో రక్తహీనత శాతం ఎక్కువగా ఉందన్నారు. దీనిని తగ్గించి హిమోగ్లోబిన్ శాతం పెంచేందుకు గ్రామీణ, పట్టణ ప్రాంతాల అధికారులు ఉత్సాహం చూపించాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, కళాశాలలపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ప్రాథమిక విద్య స్థాయి నుంచి కళాశాలల స్థాయి వరకు అన్నిచోట్ల తల్లిదండ్రులను ప్రోత్సహించి పిల్లలకు పౌష్టికాహారం అందించడం వంటి ప్రక్రియను చేపట్టాలన్నారు. స్కూలు, కళాశాల స్థాయిలో టీచర్లు, అధికారులు, వైద్య ఆరోగ్యశాఖ అందరూ కలిసి బంగారు తల్లి ప్రోగ్రెస్ కార్డులను చూస్తే విషయం అర్థమయ్యేలా తయారుచేయాలన్నారు. సమావేశంలో జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈవీఎంల తొలిదశ పరిశీలనపై శిక్షణ

గుంటూరు వెస్ట్: ఎన్నికలకు ఈవీఎంలు, వీవీప్యాట్‌లు సిద్ధం చేసే క్రమంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి తెలిపారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశమందిరంలో బెల్ కంపెనీ ఇంజినీర్లు, ఎన్నికల సిబ్బందితో కలిసి అవగాహన సదస్సు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 16న ఈవీఎంల ఫస్ట్ లెవల్ చెకింగ్ ఉంటుందని చెప్పారు. ఈ క్రమంలో సాంకేతిక సహకారం అందిస్తున్న బెల్ కంపెనీ ఇంజినీర్లతో సమన్వయం చేసుకోవాలన్నారు. ఎన్నికల ప్రక్రియలో పోలింగ్ డే తరువాత ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ ఎంతో కీలకమన్నారు. కేంద్ర, రాష్ట్ర ఎన్నికల సంఘం వెబ్‌కాస్ట్ ద్వారా సెట్టింగ్‌ను నిరంతరం పర్యవేక్షిస్తుందన్నారు. బెల్ కంపెనీ ఇంజినీర్లకు సహాయంగా ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఉద్యోగులకు విధులు కేటాయిస్తామన్నారు.

అదిగో.. అల్లదిగో.. ఇంద్రగిరి

- దసరా మహోత్సవాలకు ముస్తాబైన ఇంద్రకీలాద్రి
- రేపటి నుంచి తొమ్మిదిరోజుల పాటు నిర్వహణ
- ఆదివారం ఉదయం 9 గంటల నుంచి భక్తుల దర్శనానికి అవకాశం
- అన్ని ఏర్పాట్లు పూర్తిచేసిన అధికారులు



ఆలయంలో భక్తుల సందడి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): అదిగో.. అల్లదిగో... ఆది దంపతులైన శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉన్న ఇంద్రకీలాద్రి దసరా మహోత్సవాలకు ముస్తాబైంది. తొమ్మిది రోజుల పాటు నిర్వహించే ఉత్సవాల్లో అమ్మవారిని పది విశేష అలంకారాల్లో దర్శించుకునే భాగ్యం భక్తులకు కలగనుంది. దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారి మూలవిరాట్‌కు ప్రత్యేక అలంకారాలు జరిగే ఆలయం విజయవాడ దుర్గగుడి మాత్రమే కావడం విశేషం. ఆదివారం నుంచి ప్రారంభమయ్యే ఉత్సవాలకు ఇంద్రకీలాద్రిని అందంగా ముస్తాబు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు ఉభయ తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు, కర్ణాటక, ఒరిస్సా నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలి రానున్నారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తుంది. దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణతో పాటు ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్, కమిషనర్ సత్యనారాయణ, కలెక్టర్ ఢిల్లీరావు, పోలీస్ కమిషనర్ టీకే రాణా, దుర్గగుడి చైర్మన్ కర్నాటి రాంబాబు, ఈవో కేఎస్ రామారావు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు. భక్తుల రద్దీ ఎంత ఉన్నా గంట నుంచి గంటన్నర లోపే అమ్మవారి దర్శనం కలిగేలా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఒకసారి క్యూలైన్‌లోకి ప్రవేశించిన భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ఉచిత అన్న ప్రసాదం, లడ్డూ ప్రసాదాలను కొనుగోలు చేసిన తర్వాతే బయటకు వచ్చే అవకాశం ఉంది.

ఆదివారం ఉదయం 9 గంటల తర్వాతే దర్శనం....

ఆదివారం నుంచి ప్రారంభమయ్యే దసరా ఉత్సవాల్లో తొలి రోజున తెల్లవారుజామున అమ్మవారికి స్నపనాభిషేకం, శ్రీ బాలా త్రిపుర సుందరీదేవిగా అలంకరిస్తారు. ఉదయం 9 గంటల తర్వాతే అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. ప్రతి రోజూ తెల్లవారుజామున నాలుగు గంటలకు అమ్మవారి దర్శనం ప్రారంభమై రాత్రి 11 గంటల వరకు కొనసాగుతుంది. 20వ తేదీ మూలా నక్షత్రం రోజున మాత్రం తెల్లవారుజామున రెండు గంటల నుంచే అమ్మవారి దర్శన భాగ్యం కలుగుతుంది.

దసరా ప్రత్యేక ఆర్జిత సేవలివే...

దసరా ఉత్సవాల్లో అమ్మవారికి ప్రత్యేకంగా ఆర్జిత సేవలు నిర్వహిస్తారు. ఈ ఏడాది అమ్మవారి ఖడ్గమాలార్చన ప్రతి రోజు ఉదయం 5 గంటల నుంచి ఆరు గంటల వరకు నిర్వహిస్తారు. మహా మండపం ఆరో అంతస్తులో అమ్మవారి ఉత్సవ మూర్తి వద్ద ఖడ్గమాలార్చన చేస్తారు. ఈ ఏడాది దసరా ఉత్సవాల్లో ఖడ్గమాలార్చనను ప్రత్యేకంగా నిర్వహిస్తున్నారు. ప్రత్యేక కుంకుమార్చన రెండు బ్యాచ్‌లుగా నిర్వహిస్తారు. 15వ తేదీ ఉదయం 10 గంటల వరకు ఒక బ్యాచ్ మాత్రమే జరుగుతుంది. ఇక ఉత్సవాల్లో మిగిలిన 8 రోజులు రెండు బ్యాచ్‌లను అనుమతిస్తారు. ఉదయం 7 గంటలకు, 10 గంటలకు మహా మండపం ఆరో అంతస్తులో నిర్వహిస్తారు. ప్రత్యేక శ్రీచక్రనవార్చన మల్లికార్జున మహా మండపం రాజగోపుర ప్రాకారంలో చేస్తారు. ఉదయం 8 గంటల నుంచి 11 గంటల వరకు ఈ సేవ ఉంటుంది. ప్రత్యేక చండీ హోమం 15వ తేదీ ఉదయం 10 గంటలకు, 16వ తేదీ నుంచి ప్రతి రోజు ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతుంది.

ప్రతిరోజూ నగరోత్సవ సేవ....

దసరా ఉత్సవాల్లో ప్రత్యేకంగా నగరోత్సవ సేవను మరింత వైభవంగా నిర్వహించేందుకు దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 15వ తేదీ నుంచి సాయంత్రం 6 గంటలకు మహా మండపం నుంచి ప్రారంభమయ్యే నగరోత్సవ సేవలో ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్లు కొలువై ఉండగా, మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ ఊరేగింపు నిర్వహిస్తారు. మహా మండపం, గోశాల, కనకదుర్గ నగర్, దుర్గాఘాట్, దేవస్థాన ఘాట్‌రోడ్డు మీదగా అమ్మవారి ఆలయానికి చేరుకుంటుంది. రాజగోపురం ఎదుట పూజా కార్యక్రమాలు నిర్వహించడంతో ఊరేగింపు పూర్తవుతుంది.

ఇద్దరి ప్రాణాలను బలిగొన్న మృత్యుశకటం

లారీ డ్రైవర్ అతివేగం.. ద్విచక్ర వాహన చోదకుడి నిర్లక్ష్యం ముక్కుపచ్చలారని తన కుమార్తె ఉసురుతీయగా.. మధ్యలో లిఫ్ట్ అడిగిన మహిళ ప్రాణాలు సైతం గాల్లో కలిసిపోయాయి. పిడుగురాళ్ల మండలం బ్రాహ్మణపల్లి బైపాస్ ఎక్స్ రోడ్డు వద్ద జరిగిన ఈ హృదయవిదారక ఘటన చూపరులను కలచివేసింది. ఎంతో భవిష్యత్తు ఉన్న చిన్నారి అచేతనంగా పడి ఉండడం స్థానికులచే కంటతడి పెట్టించింది. ఘటనలో తండ్రి సైతం తీవ్రగాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు.



లక్ష్మీ తేజస్విని మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు



సంపూర్ణ మృతదేహం వద్ద విలపిస్తున్న బంధువులు

- బైకును లారీ ఢీకొన్న ఘటనలో బాలిక, మహిళ మృతి
- ఒకరికి తీవ్ర గాయాలు

పిడుగురాళ్లరూరల్: వేగంగా వస్తున్న లారీ ద్విచక్ర వాహనాన్ని వెనుక వైపు ఢీకొనగా ఇద్దరు మృతి చెందగా, ఒకరు గాయపడిన సంఘటన పిడుగురాళ్ల మండలంలోని బ్రాహ్మణపల్లి బైపాస్‌పై చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం...న్యూ వెల్లంపల్లి గ్రామానికి చెందిన పోతురాజు వెంకటేశ్వర్లు ఆటో నడుపుకొంటూ జీవనం సాగిస్తాడు. వెంకటేశ్వర్లు, భార్య రమాదేవిలకు ఇద్దరు కుమార్తెలు పెద్ద కుమార్తె లక్ష్మీ తేజస్విని(6), చిన్న కుమార్తె హర్షిత. హర్షితకు డెంగీ జ్వరం రావడంతో తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని వెంకటేశ్వర్లు న్యూ వెల్లంపల్లి నుంచి బ్రాహ్మణపల్లికి ద్విచక్రవాహనంపై ఆస్పత్రికి వెళ్తున్నాడు. ఈ సమయంలోనే అదేగ్రామానికి చెందిన కారుకుళ్ల సంపూర్ణ(49) పొలం పనుల నిమిత్తం బ్రాహ్మణపల్లి మెడికల్ కాలేజీ వైపు వెళ్తుంది. బ్రాహ్మణపల్లి వైపు వెళ్తున్న తమ్ముడు వరుసయ్యే వెంకటేశ్వర్లును బండి ఎక్కించుకోమని అడగ్గా వెంకటేశ్వర్లు ఎక్కించుకొన్నాడు. బ్రాహ్మణపల్లి ఎక్స్ రోడ్డు దగ్గరకు రాగానే గుంటూరు నుంచి దాచేపల్లి వైపు వేగంగా వెళ్తున్న లారీ వెనుక వైపు నుంచి వీరి ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ సంఘటనలో సంపూర్ణ, పోతురాజు లక్ష్మీతేజస్విని అక్కడికక్కడే మృతిచెందారు. బైక్ నడుపుతున్న వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కావటంతో నరసరావుపేట ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. బండి మీద ఉన్న పాప హర్షితకు స్వల్ప గాయాలు అయ్యాయి. ఘటనలో మృతిచెందిన సంపూర్ణకు భర్త, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పట్టణ సీఐ ఆంజనేయులు, ఎస్ఐ రబ్బానీ ఖాన్ సంఘటనా స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం గురజాల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

నేడు, రేపు ఎస్ఐ అభ్యర్థులకు రాత పరీక్షలు

- గుంటూరు రేంజ్‌లో 7,145 మంది అభ్యర్థులు
- పురుషులు 6,384, మహిళలు 761
- జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు



పోలీస్ అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న జిల్లా ఏఎస్పీ సుప్రజ

నగరంపాలెం: గుంటూరు రేంజ్‌లో శనివారం, ఆదివారాలలో ఎస్ఐ మెయిన్స్ రాత పరీక్షలు జరగనున్నాయి. 7,145 మంది అభ్యర్థులకు హాల్ టికెట్లు జారీ చేయగా, అందులో పురుష అభ్యర్థులు 6,384, మహిళా అభ్యర్థులు 761 మంది ఉన్నారు. ఇక జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాలకు వచ్చే అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా, అన్ని మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేసినట్లు ఎస్ఐ అభ్యర్థుల ఎంపిక నోడల్ అధికారిణి, గుంటూరు ఏఎస్పీ (పరిపాలన) కె.సుప్రజ తెలిపారు. ఈ మేరకు శని, ఆదివారాల్లో ఆయా పరీక్ష కేంద్రాల వద్ద చేపట్టాల్సిన పోలీస్ బందోబస్తుపై శుక్రవారం గుంటూరు నగరంలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్స్‌లో పోలీస్ అధికారులు, సిబ్బందితో సమావేశమై పలు సూచనలు చేశారు. జిల్లావ్యాప్తంగా 14 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 1 వరకు, మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 వరకు పరీక్షలు జరుగుతాయని చెప్పారు.

పరీక్ష కేంద్రాలు ఇవే..

ఏసీ కళాశాల, టీజేపీఎస్ కళాశాల, ఆర్‌వీఆర్ జేసీ కళాశాల, వీవీఐటీ, కిట్స్, విజ్ఞాన్ నిరుల, విజ్ఞాన్ డిగ్రీ కళాశాల, చేబ్రోలు హనుమయ్య ఇనిస్టిట్యూట్ కళాశాల, కైట్ కళాశాల

దళారుల మాటలు నమ్మవద్దు..

ఎస్ఐ ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పే దళారుల మోసపూరిత మాటలను నమ్మవద్దని అభ్యర్థులను ఏఎస్పీ కోరారు. ఏ ఒక్కరికీ డబ్బులిచ్చి మోసపోవద్దని చెప్పారు. కార్యక్రమంలో ఏఎస్పీలు నాచికేత్ షెల్కే (గుంటూరు తూర్పు), మహేష్ (బాపట్ల జిల్లా), డీఎస్పీలు ఉమామహేశ్వరరెడ్డి (గుంటూరు పశ్చిమ), మహబూబ్ బాషా (దక్షిణ), బాలసుందరరావు (ట్రాఫిక్), కేసీహెచ్ రామారావు (దిశా పీఎస్), ప్రకాష్ బాబు (క్రైం), చంద్రశేఖర్‌రావు (ఏఆర్), ఎస్బీ సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్లుప్తంగా

పెదకాకానిలో భక్తి శ్రద్ధలతో పవిత్రోత్సవాలు

కుంభాభిషేకం, పూర్ణాహుతితో ముగిసిన ఉత్సవాలు



పెదకాకాని: శివాలయంలో మూడు రోజుల పవిత్రోత్సవములు శాస్త్రోక్తంగా నిర్వహించడం జరిగిందని ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. స్థానిక భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో జరుగుతున్న ఈ ఉత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. చివరిరోజు బ్రహ్మశ్రీ మామిళ్ళపల్లి మృత్యుంజయ ప్రసాద శివాచార్య వారి ప్రధానాచార్యత్వమున ఆలయ స్థానాచార్యులు పాత్తూరు సాంబశివరావు, ప్రధాన అర్చక స్వామి లక్ష్మీనారాయణ వరప్రసాద్‌ల పర్యవేక్షణలో చతుర్వేదపారాయణ, నిత్య పూజావిధులు, అష్టోతర శతకాలఅభిషేకం, స్వామివార్లకు అలంకరణ, పవిత్రముల సమర్పణ, సుముహూర్తము ఉదయం 10:59 గంటలకు స్వామివార్లకు దంతకాష్ట, భస్మరక్షణాదుల ప్రదర్శన, కుంభాభిషేకం, పూర్ణాహుతి, అవబృధస్నానము అచార్యాది ఋత్మిక సన్మానం, పవిత్రములతో ఆశీర్వచనము, తీర్ధ ప్రసాద వినియోగముతో పవిత్రోత్సవాలు ముగిశాయి. తెనాలి పట్టణానికి చెందిన నేలవెల్లి కోటేశ్వరి కుటుంబసభ్యుల ద్రవ్య సహకారంతో ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి, చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. దేవదాయశాఖ ఉప కమిషనర్ ఈమని చంద్రశేఖర రెడ్డి, పాలకవర్గం సభ్యులు పూజాది కార్యక్రమాల్లో పాల్గొన్నారు. పవిత్రోత్సవ క్రతువు అనంతరం భక్తులందరికీ అన్నసంతర్పణ జరిగింది. సాయంత్రం 5 గంటలకు శ్రీ భ్రమరాంబ సమేత మల్లేశ్వర స్వామివారి ఉత్సవమూర్తులను ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన మిద్దె వాహనంపై అలంకరించి ఘనంగా గ్రామోత్సవం నిర్వహించారు.

వేకువజామున రాహు కేతు గ్రహ పూజలు

శివాలయంలో శనివారం మహాలయ అమావాస్య పురస్కరించుకుని వేకువ జామున 5 గంటల నుంచే రాహు కేతు గ్రహ పూజలు నిర్వహిస్తున్నట్లు ఆలయ సహాయ కమీషనర్ ఏసీ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. పవిత్రోత్సవము ముగియడంతో ఆలయంలోని అన్ని రకాల ఆర్జితసేవలు భక్తుల సౌకర్యార్థం అందుబాటులోకి తీసుకువచ్చినట్లు ఏసీ తెలియజేశారు.

బాలికల ఆరోగ్యమే 'బంగారు తల్లి' లక్ష్యం

జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



బంగారుతల్లి కార్డులను పంపిణీ చేస్తున్న జేసీ

గురజాల: బాలికలు ఆరోగ్యంగా ఉండాలనే లక్ష్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బంగారు తల్లి కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని పల్నాడు జిల్లా కలెక్టర్ జె.శ్యాంప్రసాద్ అన్నారు. నగర పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం బంగారు తల్లి ప్రారంభ కార్యక్రమానికి జేసీ ముఖ్యఅతిథిగా పాల్గొని, మాట్లాడారు. బాలికలు చదువులోనూ, క్రీడల్లోనూ ముందుడాలన్నారు. బాలికలు ఆరోగ్యంగా ఉండాలనే ఆలోచనతో ప్రభుత్వం పలు పథకాలు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు. బాలికలు పౌష్టికాహారం తీసుకుని ఆరోగ్యంగా ఉండాలన్నారు. అనంతరం చిన్నారులకు బంగారు తల్లి కార్డులను పంపిణీ చేశారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన..

అనంతరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుతీరును జేసీ శ్యామ్ ప్రసాద్ తనిఖీ చేశారు. రుచికరమైన భోజనంతో పాటు పోషకాలు కలిగిన మంచి ఆహారాన్ని విద్యార్థులకు అందించాలన్నారు. మెనూలో పలు కీలక మార్పులు తీసుకువచ్చి విద్యార్థులకు మంచి, బలమైన ఆహారం అందించే విధంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రణాళికలు రూపొందించారన్నారు. ఆయనవెంట తహసీల్దార్ మీసాల దానియేలు, ఆర్డీఓ పరిపాలనాధికారి ఎస్.శివనాగిరెడ్డి, నగర పంచాయతీ కమిషనర్ అన్నదాత మోహన శ్రీనివాస్, నగర పంచాయతీ చైర్‌పర్సన్ పోలు పవన్మయి వీరారెడ్డి, చైర్‌పర్సన్ మన్నెం కన్యాకుమారి ప్రసాద్, కౌన్సిలర్లు, ఎంఈఓ ఉన్నారు.

ఏపీలోని గ్రామ సచివాలయ సేవలు భేష్

- కేరళకు చెందిన కైలా స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బాలకృష్ణన్
- యడ్లపాడు గ్రామ సచివాలయం సందర్శన



యడ్లపాడు సచివాలయం అధికారులు, ప్రజాప్రతినిధులతో బాలకృష్ణన్

యడ్లపాడు: గ్రామీణ స్థాయిల్లో అన్ని రకాల పౌర సేవలు సకాలంలో అందించి పంచాయతీకి మంచి గుర్తింపు తీసుకువచ్చేందుకు సమన్వయంతో కృషి చేయాలని కేరళకు చెందిన కైలా స్వచ్ఛంద సంస్థ జిల్లా కోఆర్డినేటర్ బాలకృష్ణన్ చెప్పారు. కేరళ కైలా సంస్థ ప్రతినిధి, జిల్లాస్థాయి అధికారులు శుక్రవారం యడ్లపాడు గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పంచాయతీ, సచివాలయం రికార్డులు, అధికారులు, సిబ్బంది పనితీరు, వసతులు కల్పన, ప్రజలకు అందిస్తున్న పౌరసేవలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వివరాలు, వాటి ప్రదర్శన బోర్డులు తదితర అంశాలను పరిశీలించారు. ఈసందర్భంగా సచివాలయం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 52 పంచాయతీలు ఐఎస్ఓ -9001-2015 అర్హత పరిశీలనలో భాగంగా ఆయా పంచాయతీలను సందర్శిస్తున్నట్లు వెల్లడించారు. పల్నాడు జిల్లాలోని యడ్లపాడు, నకిరేకల్లు మండలాలు వీటిలో ఉన్నాయన్నారు. ఒక వస్తువుకు నాణ్యతను నిర్ధారితం ఎలానో పంచాయతీలకు కూడా ఆయా సేవలు, నిర్వహణ తదితర అంశాలను పరిశీలించి ఇవ్వడం జరుగుతుందన్నారు. తమ సంస్థ వీటిని క్షేత్రస్థాయిలో గుర్తించి తుదినివేదికను సమర్పిస్తామన్నారు. ఏపీ రాష్ట్రంలోని పంచాయతీలన్నీ అత్యధిక సేవలను అందిస్తున్నందుకు సంతోషంగా ఉందన్నారు. సిబ్బంది ఇదే తీరుగా మరిన్ని సేవలు అందిస్తూ గ్రామ పంచాయతీకి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో డీపీఓ ఎంవీ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ వై. హనుమారెడ్డి, ఈఓపీఆర్డీ వరూధిని, పంచాయతీ కార్యదర్శి శశికళ, ఎస్ శోభన్‌బాబు, ఎంపీపీ పిడతల ఝాన్సీ, సర్పంచి కె.హేమ, ఎంపీటీసీ సభ్యులు కీర్తి అరుణ్ కుమార్, సయ్యద్ సుభాని, జిల్లా పంచాయతీ వనరుల కేంద్రం ఆర్పీలు కరిముద్దీన్, నిరంజన్, నరసింహనాయక్ పాల్గొన్నారు.

ఏపీ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా తోట

పర్చూరు(కారంచేడు): కాంగ్రెస్ పార్టీ ఏపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా పర్చూరుకు చెందిన తోట శివ నాగేశ్వరరావు నియమితులయ్యారు. ఈమేరకు అయనకు ఏపీసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ నుంచి ఉత్తర్వులు అందినట్లు శివనాగేశ్వరరావు తెలిపారు. పార్టీ తనపై ఉంచిన నమ్మకంను వమ్ము చేయకుండా కాంగ్రెస్ పార్టీ విజయానికి, ప్రజల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తానన్నారు.

ఓపెన్ అడ్మిషన్ల దరఖాస్తు గడువు పొడిగింపు

సత్తెనపల్లి: సార్వత్రిక విద్యాపీఠం (ఓపెన్ స్కూల్) ద్వారా 2023-24 విద్యా సంవత్సరంలో 10వ తరగతి, ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగించినట్లు పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి కె.శామ్యూల్ శుక్రవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. అపరాధ రుసుం లేకుండా ఈనెల 16 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. రూ.200 అపరాధ రుసుంతో ఈనెల 30 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. పదో తరగతిలో చేరేందుకు 14 ఏళ్లు నిండినవారు, ఇంటర్‌లో చేరేందుకు పదో తరగతి పూర్తయి 15 ఏళ్లు నిండిన వారు అర్హులన్నారు. ఈ అవకాశాన్ని అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వేద ప్లాటినం హైబ్రిడ్ పత్తి విత్తనంతో అధిక దిగుబడి



88 త్యాళ్లూరు(క్రోసూరు): వేద ప్లాటినం హైబ్రిడ్ ప్రత్తి విత్తనంతో అధికదిగుబడి పొందవచ్చునని కంపెనీ డీజీఎం దావులూరి నాగబాబు శుక్రవారం తెలిపారు. మండలంలోని 88 త్యాళ్లూరు గ్రామంలో పత్తి క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. కంపెనీ డీజీఎం మాట్లాడుతూ వేద ప్లాటినం పత్తి విత్తనం రకం అన్ని రకాల నేలలకు అనువైనదని చెప్పారు. గులాబీ పురుగు, దోమపోటు, ఇతర తెగుళ్లను సమర్ధవంతంగా ఎదుర్కొంటుందన్నారు. అధిక దిగుబడి ఇస్తుందని, పత్తి తీసేందుకు సులువైన విత్తనమని వివరించారు. ప్రతి చెట్టుకు 80 నుంచి 100 కాయలను కలిగి ఉంటుందన్నారు. ఎకరాకు 17 నుంచి 22 క్వింటాళ్ల దిగుబడి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిస్ట్రిబ్యూటర్లు కె.పెద్దిరెడ్డి, ఎ.శ్రీనివాసరెడ్డి, సాంబశివరావు, రవితేజ, డీలర్లు, ఏరియా మేనేజరు జి.రమేష్, రీజనల్ మేనేజరు తోట సుబ్రమణ్యం, నామా శ్రావణ్‌కుమార్, సాంబశివరావు , మర్కెంటింగ్ సిబ్బందితో పాటు చుట్టుప్రక్కల గ్రామాల రైతులు 700 మంది హాజరయ్యారు.

ఉక్కు సత్యాగ్రహం సినిమా లోగో ఆవిష్కరణ



ఉక్కు సత్యాగ్రహం సినిమా లోగోను ఆవిష్కరించిన ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి

పాత గుంటూరు: ఉక్కు సత్యాగ్రహం సినిమా లోగోను ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆవిష్కరించారు. విశాఖ ఉక్కు పరిరక్షణ నినాదంతో సత్యారెడ్డి రచన, దర్శకత్వం, కథానాయకుడిగా నిర్మించిన ఉక్కు సత్యాగ్రహం సినిమా ప్రమోషన్‌లో భాగంగా లోగో ఆవిష్కరణ కార్యక్రమం అరండల్ పేటలోని హోటల్ గీతా రెసిడెన్సీలో శుక్రవారం నిర్వహించారు. చిత్ర హీరో సత్య రెడ్డి మాట్లాడుతూ విశాఖ ఉక్కు పోరాట చరిత్ర, విశాఖ ఉక్కు పరిరక్షణ నేపథ్యంలో ఉప్పు సత్యాగ్రహం చిత్రం నిర్మించడం జరిగిందని వెల్లడించారు. ప్రజా గాయకులు గద్దర్ చిత్రంలో నటించడంతో పాటు రెండు పాటలను రచించారని పేర్కొన్నారు. గుంటూరు, పల్నాడు, విశాఖ తదితర ప్రాంతాల్లో సినిమా షూటింగ్ జరిగిందని తెలిపారు. నవంబర్‌లో విడుదల కానున్న ఉక్కు సత్యాగ్రహం చిత్రాన్ని ప్రతి ఒక్కరూ కుటుంబ సమేతంగా చూడాలని కోరారు. కార్యక్రమంలో గాయకులు రమణ పాల్గొన్నారు.

రైతుల సమస్యలు పరిష్కరించాలి

జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్



తహసీల్దార్ కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న జేసీ శ్యాంప్రసాద్

దాచేపల్లి: రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ ఆదేశించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మండలంలో జరుగుతున్న రీ సర్వేపై ఆరా తీశారు. రీసర్వేలో సక్రమంగా పనిచేయని రెవెన్యూ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ జి.కరుణకుమార్‌ను ఆదేశించారు. అసైన్డ్ భూములు, గ్రామాల్లోని సర్వీస్ ఇనామ్‌లు, మ్యూటేషన్, సబ్ డివిజన్‌తో పాటుగా పలు అంశాలపై సమీక్ష జరిపారు. పలు సమస్యలపై ఎస్సీ,ఎస్టీ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు వట్టెపు మరియదాసు జేసీకి వినతి పత్రం అందజేశారు. రైతుల సమస్యలను ఆలస్యం చేయకుండా సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయాలని, ఆన్‌లైన్‌లో పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరించాలని జేసీ ఆదేశించారు. జేసీ వెంట డెప్యూటీ తహసీల్దార్ బ్రహ్మం, ఆర్ఐ శరత్‌కుమార్, సర్వేయర్ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ఆంధ్ర సెంట్రల్ జోన్ చాంపియన్ 'గుంటూరు'

రెండు విజయాలు, ఒక డ్రాతో చాంపియన్‌షిప్ కైవసం



చెన్ను సిద్ధార్థ, 100 పరుగులు



సుశాంత్, 5 వికెట్లు, కృష్ణా జిల్లా బౌలర్

నరసరావుపేట ఈస్ట్: ఆంధ్ర సెంట్రల్ జోన్ చాంపియన్‌గా గుంటూరు జట్టు కైవశం చేసుకుంది.

ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏసీఏ, ఎస్‌కేఆర్‌బీఆర్ క్రికెట్ గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న ఆంధ్ర సెంట్రల్ జోన్ అండర్-23 అంతర్ జిల్లాల మూడు రోజుల టెస్ట్ మ్యాచ్‌లలో గుంటూరుజిల్లా జట్టు సెంట్రల్ జోన్ చాంపియన్‌గా నిలిచింది. టోర్నమెంట్‌లో రెండు విజయాలు, ఒక డ్రాతో అత్యధిక పాయింట్లు సాధించటంతో గుంటూరు జట్టును చాంపియన్‌గా ప్రకటించారు. సెంట్రల్‌జోన్ మూడో మ్యాచ్‌లో గురువారం నాటి ఓవర్‌నైట్ స్కోర్ ఆరు వికెట్లు నష్టానికి 100 పరుగులతో శుక్రవారం బ్యాటింగ్ ప్రారంభించిన గుంటూరు జట్టు 268 పరుగులకు ఆలౌట్ అయింది. జట్టులోని చెన్ను సిద్ధార్థ సెంచరీ సాధించగా, షేక్ ఇద్రిస్ 34 పరుగులతో సహకారం అందించాడు. కృష్ణా జట్టు బౌలర్ సుశాంత్ ఐదు వికెట్లు సాధించాడు. అనంతరం తన రెండో ఇన్నింగ్ ప్రారంభించిన కృష్ణా జట్టు చివరిరోజు ఆట ముగిసే సమయానికి 4వికెట్ల నష్టానికి 69 పరుగులు చేసి మ్యాచ్‌ను డ్రాగా ముగించింది. మ్యాచ్‌ను ఏసీఏ అపెక్స్ కౌన్సిల్ సభ్యుడు కె.వి.పురుషోత్తమరావు, ఏసీఏ సీనియర్ సెలక్షన్ కమిటీ సభ్యుడు కె.ఎస్.టీ. సాయి, గుంటూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి డి.రమేష్‌కుమార్, గ్రౌండ్ అడ్మినిస్ట్రేటర్ ఎన్.సీతాపతిరావు పర్యవేక్షించారు.

ఆటో బోల్తా.. మహిళ మృతి

డ్రైవర్‌తో పాటు పాపకు గాయాలు



ప్రమాదంలో మృతి చెందిన అనూరాధ

పర్చూరు(కారంచేడు): ఆటో బోల్తా పడి మహిళ మృతి చెందిన ఘటన శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. మరో ఇద్దరు గాయపడ్డారు. ఏఎస్ఐ కోటేశ్వరావు తెలిపిన వివరాలు.. పల్నాడు జిల్లా చిలకలూరిపేట మండలం మురికిపూడి గ్రామానికి చెందిన ఏడుగురు ఆటోలో చీరాల అమ్మవారి దేవాలయంలో ప్రత్యేక పూజల కోసం బయలుదేరారు. ఈ క్రమంలో వాడరేవు- పిడుగురాళ్ల ప్రధాన రహదారిలో కారంచేడు- పర్చూరు గ్రామాల మధ్యన ఉన్న పాలిటెక్నిక్ కళాశాలకు సమీపం ప్రమాదం చోటుచేసుకుంది. అదుపు తప్పి ఆటో తిరగబడింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న అనూరాధ(35)కు తలకు తీవ్రమైన గాయాలయ్యాయి. దీంతో ఆమె అక్కడిక్కడే మృతి చెందింది. గాయపడిన చిన్నారి వర్షను, పాలపర్తి రామాంజనేయులు, ఉయ్యాల రామాంజనేయులను 108 ద్వారా చీరాల ఆస్పత్రికి తరలించారు. మృతదేహాన్ని కూడా చీరాల ప్రభుత్వ ఆస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మిగిలిన నలుగురు ఇంటికి వెళ్లిపోయారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. గతంలోను ఇదే ప్రదేశంలో ఒక బాలుడు ప్రమాదంలో మృతి చెందాడని, రోడ్డుకు మరమ్మతులు చేయించమని ఎన్నిసార్లు విన్నవించినా సమస్యలు పరిష్కారం కావడం లేదని ప్రజలు వాపోతున్నారు.

ఎన్జీరంగా వర్సిటీకి రీసెర్చ్ టూర్ ప్రతినిధులు



వీసీ డాక్టర్ శారదాజయలక్ష్మిదేవి శాస్త్రవేత్తలతో పరిశోధన బృందం

గుంటూరు రూరల్: భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ, స్ప్రింగర్ నేచర్ భారత పరిశోధన పర్యటనలో భాగంగా ఇండియన్ రీసెర్చ్ టూర్ ప్రతినిధుల బృందం శుక్రవారం ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయాన్ని సందర్శించింది. లాం లోని వ్యవసాయ పరిశోధన భవనంలో వీసీ డాక్టర్ శారద జయలక్ష్మీదేవి ప్రతినిధుల బృందానికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ స్ప్రింగ్ నేచర్ ఇండియా, ఇండియా ఎడ్యుకేషన్ మినిస్ట్రీ సంయుక్తంగా జీ- 20 కార్యక్రమంలో భాగంగా ఆగస్టు 26న భువనేశ్వర్‌లో సమావేశమై ఇండియన్ రీసెర్చ్ టూర్ బస్సు ద్వారా నిర్వహించాలని నిర్ణయం తీసుకున్నారని చెప్పారు. అక్కడి నుంచి సెప్టెంబర్ 28న ఢిల్లీ యూనివర్సిటీలో మొదలుపెట్టి బిట్స్ పిలాని, ఎన్ఐటీ జైపూర్, డెల్, ఆగ్రా ఐఐఎస్సీ నాగపూర్, హైదరాబాద్ యూనివర్సిటీ, ఐఐఎస్ఈఆర్ బెంగళూరు, వీఐటీ వేలూరు, ఐఐటీ చెన్నైలలో ఇప్పటికే పరిశీలన పూర్తయిందని పేర్కొన్నారు. అందులో భాగంగా ఎన్జీరంగా వర్సిటీ పర్యటనకు వచ్చినట్లు వివరించారు. ఈ పరిశోధన టూర్ ద్వారా పరిశోధన సహకారం, రాష్ట్ర జాతీయ ప్రభుత్వాల పార్టనర్ షిప్‌లు పెంపొందించటం, పబ్లికేషన్స్ ద్వారా పరిశోధన అంశాలు పబ్లిష్ చేయటం సైంటిఫిక్ కమ్యూనిటీలో సమన్వయం అభివృద్ధి చేయటం జరుగుతుందని చెప్పారు. ఈ ప్రతిష్టాత్మకమైన పరిశోధన పర్యటనలో దేశవ్యాప్తంగా ఎంపిక చేయబడిన 15 సంస్థల్లో ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఒకటని వివరించారు. ప్రతినిధుల బృందానికి విశ్వవిద్యాలయం అభివృద్ధి, కార్యాచరణపై వివరాలు వెల్లడించారు. విశ్వవిద్యాలయం అకడమిక్ రిసోర్సెస్, లైబ్రరీ రిసోర్స్‌లో డిజిటల్ ఇన్నోవేషన్‌లు, పరిశోధన ఫలితాలను డాక్టర్ ఎ.మణి వివరించారు. స్ప్రింగర్ నేచర్ ఇండియా మేనేజింగ్ డైరెక్టర్ వెంకటేష్ సర్వసిద్ధి టూర్ ఉద్దేశాన్ని వివరించారు.

భారతదేశలో పరిశోధన దృక్పథాన్ని బలోపేతం చేసేందుకు ఈ పరిశోధన టూర్ ఎంతో ఉపయోగకరమని తెలిపారు. వీసీ, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ డాక్టర్ ఎల్.ప్రశాంతి, అగ్రి ఇంజినీరింగ్ డీన్ డాక్టర్ ఎ.మణి, డాక్టర్ పి.వాసంతి, ప్రిన్సిపాల్ సైంటిస్ట్ డాక్టర్ ఎ.సీతారామలక్ష్మి బృందం ఆమె పరిశోధన మా భవిష్యత్ అనే విషయంపై బృంద చర్చల్లో భాగంగా రీసెర్చ్ ఇన్నోవేషన్ డెసిమినేషన్, ఓపెన్ ఆక్సిస్ అనే విషయాలను చర్చించారు. కార్యక్రమంలో భాగంగా పరిశోధన టూర్ ప్రతినిధుల బృందాన్ని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు, తదితరులు పాల్గొన్నారు.